సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

గురువారం । 17 । అక్టోబర్ । 2024



సోమశిలలో 53.27 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో బుధవారం నాటికి 53.27 టీఎంసీల నీరు నిల్వ ఉంది.ఎగువ ప్రాంతాల నుంచి 24,058 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.78,920
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.7,168
మూడు శాతం జీఎస్టీతో	రూ.7,383
నవర (8 గ్రాములు)	రూ.59,064

గరిష్టం/కనిష్టం
26.5 /24.5

వాతావరణం

వాయుగుండం ప్రభావంతో జిల్లాలో గురువారం పలు ప్రాంతాలలో పెనుగాలులతో పాటు భారీ వర్షం కురవవచ్చని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

విద్యాసంస్థలకు నేడూ సెలవు

నెల్లూరు(దర్గామిట్ట): వాయుగుండం ప్రభావంతో జిల్లాలోని విద్యాసంస్థలకు సెలవును గురువారం ప్రకటించారు. ఈ మేరకు కలెక్టర్ ఆనంద్ ఒక ప్రకటనను బుధవారం విడుదల చేశారు.

అప్రమత్తంగా ఉండాలి



పునరావాస కేంద్రంలో కలెక్టర్, ఎస్పీ

ఇందుకూరుపేట: భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. మండలంలోని మైపాడు బీచ్‌ను ఎస్పీ కృష్ణకాంత్‌తో కలిసి బుధవారం పరిశీలించారు. గంగపట్నంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. సముద్రంలో వేట కెళ్లొద్దని కోరారు. జిల్లాలో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అన్ని జాగ్రత్తలు చేపడుతున్నామని వివరించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించి అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నామని చెప్పారు. మరో 48 గంటల పాటు అప్రమత్తంగా ఉండాలని కోరారు. రానున్న మూడు రోజుల్లో సోమశిల జలాశయానికి లక్ష క్యూసెక్కుల ప్రవాహం వచ్చే అవకాశం ఉందన్నారు. ఇన్‌ఫ్లో ఆధారంగా అవసరమైతే నీటిని విడుదల చేస్తామని పేర్కొన్నారు. ఇరిగేషన్ శాఖ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తోందని, ఆ శాఖ సిబ్బందితో పాటు పోలీసులను ఏర్పాటు చేసి తగు జాగ్రత్తలను చేపడుతున్నామని వివరించారు. పునరావాస కేంద్రంలోని వారితో ముచ్చటించారు. బకింగ్‌హామ్ కెనాల్‌పై వంతెనను నిర్మించాలని స్థానికులు కోరగా, పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఎస్పీ మాట్లాడారు. పెన్నా పరీవాహక ప్రాంతాల్లో కట్టలను పరిశీలిస్తూ, బలహీనంగా ఉన్న చోట పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశామన్నారు. తహసీల్దార్ కృష్ణప్రసాద్, సీఐ సుధాకర్‌రెడ్డి, ఎస్సై నాగార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్‌ఎం ఉద్యోగోన్నతుల జాబితా విడుదల

నెల్లూరు(అర్బన్): జిల్లాలో ఏఎన్‌ఎం గ్రేడ్ – 3 నర్సులుగా పనిచేస్తున్న వారికి ఎంపీహెచ్ఏలుగా ఉద్యోగోన్నతులు కల్పించేందుకు తయారు చేసిన ప్రొవిజనల్ సీనియార్టీ జాబితాను విడుదల చేశామని డీఎంహెచ్ఓ పెంచలయ్య బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. spsnellore. ap. gov. inలో దీన్ని ఉంచామని, ఏమైనా అభ్యంతరాలుంటే సంబంధిత ఏఎన్ఎంలు జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రంలోపు తెలియజేయాలని కోరారు. ఆ తర్వాత వచ్చే అభ్యంతరాలను పరిశీలించబోమని స్పష్టం చేశారు.

విజయవాడ బస్సులకు నేటి నుంచి రిజర్వేషన్లు

నెల్లూరు సిటీ: నెల్లూరు – విజయవాడ – నెల్లూరు మధ్య తిరిగే సూపర్‌లగ్జరీ సర్వీసులకు రిజర్వేషన్ సౌకర్యాన్ని గురువారం నుంచి కల్పించనున్నామని ఒకటో డిపో మేనేజర్ మురళీకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరు నుంచి రోజూ ఉదయం నాలుగు, ఐదు, 7.30 గంటలకు, మధ్యాహ్నం 1.30, సాయంత్రం నాలుగు, 4.30కు బస్సు సర్వీసులున్నాయని వివరించారు. విజయవాడ నుంచి నెల్లూరుకు ఉదయం 11.20, 12.30, మధ్యాహ్నం 3.30, రాత్రి తొమ్మిది, రాత్రి 12.05, 12.30కు బస్సులుంటాయని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జీజీహెచ్‌లో మత్తు వైద్య దినోత్సవం



ప్రొఫెసర్ శాంతిని సత్కరిస్తున్న వైద్యులు

నెల్లూరు (టౌన్) : దర్గామిట్టలోని జీజీహెచ్‌లో ప్రపంచ మత్తు వైద్య దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆస్పత్రి సూపరింటెండెంట్ సిద్ధానాయక్ హాజరయ్యారు. శస్త్ర చికిత్సలో మత్తు వైద్య ప్రాధాన్యాన్ని వివరించారు. మత్తు వైద్య విభాగంలో పీజీ విద్యార్థులు కొత్త పరిశోధనలు చేయాలని ప్రిన్సిపల్ డాక్టర్ గోవిందు కోరారు. మత్తు వైద్యంలో ఎలాంటి పరిణామాలు చోటు చేసుకుంటున్నాయో మత్తు వైద్య విభాగాధిపతి శ్రీనివాసరావు వివరించారు. అనంతరం ప్రొఫెసర్ శాంతిని సత్కరించారు.



జలదిగ్బంధంలో బుజబుజనెల్లూరు తల్పగిరి కాలనీ



కుండపోత

జిల్లాను వాయుగుండం వణికిస్తోంది. చెన్నై సమీపంలో తీరాన్ని గురువారం తెల్లవారుజామున దాటనుండటంతో దాని ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా బుధవారం కుండపోతగా వర్షాలు పడ్డాయి. జలదంకి, కావలి మండలాల్లో అత్యధికంగా 185.6, 174.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఎడతెరిపి లేని వర్షాలతో జనజీవనం స్తంభించింది. నెల్లూరు నగరంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ముందస్తు చర్యల్లో భాగంగా జిల్లాకు రెండు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు చేరుకున్నాయి.

- జిల్లాను వణికిస్తున్న వాయుగుండం
- పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు
- కొమ్మలేరు ఉధృతికి నీట మునిగిన పొలాలు
- తీర గ్రామాల్లో ముంపులో లోతట్టు ప్రాంతాలు
- 83.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు
- కల్లోలంగా కడలి

నెల్లూరు(దర్గామిట్ట) / నెల్లూరు(అర్బన్): నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం వాయుగుండంగా మారింది. దీంతో జిల్లాలో అత్యవసర పరిస్థితిని కలెక్టర్ ఆనంద్ ప్రకటించారు. పెన్నా పరీవాహక ప్రాంతాలు, సముద్ర తీర ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తూ కలెక్టర్‌తో పాటు ఎస్పీ కృష్ణకాంత్, అధికారులు ఆయా గ్రామాల్లో పర్యటిస్తున్నారు. జిల్లాలో సరాసరి వర్షపాతం 83.5 మిల్లీమీటర్లుగా నమోదైంది.

లోతట్టు ప్రాంతాల జలమయం

నగరంలోని మనుమసిద్ధినగర్, డ్రైవర్స్‌కాలనీ, టీచర్స్ కాలనీ, జయలలితనగర్, మన్సూర్‌నగర్‌తో పాటు ఆర్టీసీ కాలనీ, తల్పగిరికాలనీ, సుందరయ్యకాలనీలోని కొన్ని ప్రాంతాలు జలమయమయ్యాయి. ఇళ్లలోకి నీరు చేరడంతో కార్పొరేషన్ అధికారులు యుద్ధప్రాతిపదికన జేసీబీలతో తాత్కాలిక అవుట్‌లెట్లను ఏర్పాటు చేసి బయటకెళ్లేలా చర్యలు చేపట్టారు. నగరంలో కాలువలను ఆక్రమించి ఫుట్‌పాత్‌లు, ఇతర నిర్మాణాలు చేపట్టిన చోట జేసీబీలతో పునరుద్ధరిస్తున్నారు. నగరంలోని సుమారు 8.5 లక్షల జనాభాలో దాదాపు 1.5 లక్షల మంది వర్ష ప్రభావంతో ఇబ్బంది పడుతున్నారు. జిల్లాలో రెండు చోట్ల ప్రహరీలు కూలాయి. గాంధీబొమ్మ, పొగతోట, ఆచారివీధి, కాపువీధి తదితర ప్రాంతాల్లో మురుగుతో నిండిన నీరు రోడ్లపై ప్రవహించడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ముందుకొచ్చిన సముద్రం

సముద్రం పలుచోట్ల ముందుకొచ్చింది. కొత్తకోడూరు, మైపాడు, రామతీర్థం, అల్లూరు, ఇస్కపల్లి తదితర చోట్ల సముద్రం కసురుపై ఉంటూ అలలు మూడు నుంచి నాలుగు మీటర్ల వరకు ఎగసిపడుతున్నాయి. ఆయా ప్రాంతాల్లో ఐదారు మీటర్ల వరకు సముద్రం ముందుకొచ్చింది.



వరికుంటపాడులో ఉధృతంగా ప్రవహిస్తున్న కనియంపాడు వాగు

ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు

- నగరంలోని పలు కాలువలతో పాటు ఉదయగిరి నియోజకవర్గంలోని కొండాపురం, వరికుంటపాడు మండలాల్లో మిడతవాగు, కనియంపాడు వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.
- అనంతసాగరం మండలం కొమ్మలేరు వాగు ప్రవాహానికి దాదాపు 600 ఎకరాల్లో చేతికొచ్చే దశలో ఉన్న వరి పంట నీటమునిగింది.
- కొండాపురం మండలం సత్యవోలు అగ్రహారం వద్ద మిడతవాగు ప్రవాహానికి కావలి, కొండాపురం మధ్య రాకపోకలు స్తంభించాయి.

14 పునరావాస కేంద్రాల ఏర్పాటు

జిల్లాలో 14 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. అక్కడ ఏర్పాట్లను ఎస్పీ కృష్ణకాంత్‌తో కలిసి కలెక్టర్ ఆనంద్ పరిశీలించారు. 312 కుటుంబాలకు సంబంధించిన 870 మంది ఇక్కడ ఆశ్రయం పొందుతున్నారు. ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న పెన్నా పొర్లుకట్టల వద్ద పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు. మరో 48 గంటల పాటు మత్స్యకారులు వేటకెళ్లొద్దని హెచ్చరికలు జారీ చేశారు. సెలవులో ఉన్న అధికారులు తక్షణమే విధులకు హాజరుకావాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.



పునరావాస కేంద్రంలో బాధితులు



అయ్యప్పగుడి సమీపంలోని రహదారిపై ఇలా..

రాకపోకలకు అంతరాయం

చేజర్ల: భారీ వర్షంతో చేజర్ల – సంగం మధ్యలోని గొల్లపల్లి వద్ద పందల వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో ఆ మార్గంలో రాకపోకలకు బుధవారం అంతరాయం ఏర్పడింది. ఎస్సై ప్రభాకర్ అక్కడికి చేరుకొని పరిశీలించారు. ఆ ప్రాంతంలో పోలీసులను ఉంచారు.

- యర్రబల్లి నుంచి యనమదలకు వెళ్లే మార్గంలోని నల్లవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. కలువాయి నుంచి కాకివాయి మీదుగా చేజర్లకు వెళ్లే మార్గంలోని బ్రిడ్జిపై నీరు ప్రవహిస్తుండటంతో రాకపోకలు నిలిచిపోయాయి. డీఎస్పీ వేణుగోపాల్ పరిశీలించారు.



చేజర్ల: నల్లవాగును పరిశీలిస్తున్న డీఎస్పీ

తమిళ బోట్ల తీరే వేరయా..!

కావలి: వాయుగుండం ప్రభావంతో సముద్రం అల్లకల్లోలంగా ఉన్నా, తమిళ బోట్లు యథేచ్ఛగా చేపల వేటను కొనసాగిస్తున్నాయి. మండలంలోని కొత్తసత్రం సముద్ర తీరంలో తమ వేట సామగ్రిని పరిశీలించేందుకు బుధవారం వచ్చిన మత్స్యకారులకు ఈ దృశ్యం తారసపడింది. మూడు బోట్లలో తమిళ జాలర్లు దర్జాగా చేపల వేట సాగిస్తున్నారు. సముద్రంలోకి చేపల వేటకెళ్లొద్దని మత్స్యకారులకు ప్రభుత్వాలు స్పష్టంగా చెప్పినా, వీరు ఏ మాత్రం ఖాతరు చేయడం లేదు.



పొగతోటలో రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

'సోమశిల'పై నిరంతర పర్యవేక్షణ

ఆత్మకూరు: సోమశిల జలాశయాన్ని నిరంతరం పర్యవేక్షిస్తున్నామని ప్రాజెక్ట్ ఎస్ఈ వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు వివరాలను బుధవారం ఆయన తెలియజేశారు. జలాశయానికి గతంలో అధిక నీటి తాకిడి దృష్ట్యా తగు జాగ్రత్తలు తీసుకొని దిగువకు విడుదల చేస్తున్నామని తెలిపారు. ప్రాజెక్ట్ పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ, జలాశయాన్ని నింపుతామన్నారు. కలెక్టర్, రాష్ట్ర ఉన్నతాధికారులకు నివేదికలను ఎప్పటికప్పుడు పంపుతున్నామని వివరించారు.

జిల్లాలో ఇలా..

మండలం	వర్షపాతం (మిల్లీమీటర్లలో)	మండలం	వర్షపాతం (మిల్లీమీటర్లలో)
జలదంకి	185.6		
కావలి	174.4		
నెల్లూరు అర్బన్	135.6	వలేటివారిపాలెం	77.6
నెల్లూరు రూరల్	123.8	కలువాయి	76.2
కొండాపురం	108.2	ఉలవపాడు	72.6
తోటపల్లిగూడూరు	103.4	దగదర్తి	68.4
పొదలకూరు	103.2	దుత్తలూరు	68.4
కందుకూరు	102.8	బుచ్చిరెడ్డిపాలెం	68.2
ఇందుకూరుపేట	99.8	మనుబోలు	65.2
కోవూరు	99.2	విడవలూరు	65.2
లింగసముద్రం	97.6	కొడవలూరు	64.6
సీతారామపురం	97.2	రాపూరు	62.4
వరికుంటపాడు	95.6	అనంతసాగరం	58.2
వింజమూరు	92.8	బోగోలు	51.6
వెంకటాచలం	90.8	అల్లూరు	50.2
సైదాపురం	88.2	సంగం	47.6
ఉదయగిరి	87.8	ఆత్మకూరు	44.6
గుడ్లూరు	85.2	చేజర్ల	38.4
ముత్తుకూరు	80.2	మర్రిపాడు	35.4
కలిగిరి	80.2	అనుమసముద్రంపేట	35.4

నీటమునిగిన పొలాలు



నెల్లూరు(సెంట్రల్): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు చేజర్ల, విడవలూరు, జలదంకి, కొడవలూరు, సీతారామపురం, వింజమూరు, కలిగిరి, కొండాపురం మండలాల్లో వరి, పొగాకు రైతులకు నష్టం వాటిల్లింది. దాదాపు 416 మంది రైతులకు సంబంధించిన 652 ఎకరాల్లో వరితో పాటు కొంత మేర పొగాకుకు నష్టం కలిగింది.

సోమశిల: మండల పరిధిలోని కొత్తపల్లి, వడ్డిపాలెం, పాతదేవరాయపల్లి గ్రామాల్లో కొమ్మలేరు వాగు ఉధృతంగా ప్రవహించడంతో 350 ఎకరాల్లో వరి పైరుకు నష్టం వాటిల్లిందని మండల వ్యవసాయాధికారి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. నీట మునిగిన పొలాలను ఆయన పరిశీలించారు.



సోమశిల జలాశయాన్ని పరిశీలిస్తున్న అధికారులు



కొండాపురం మండలంలో పొంగిపొర్లుతున్న మిడతవాగు



బుజబుజనెల్లూరులోని జాతీయ రహదారిపై..



నీటమునిగిన ఆర్టీసీ కాలనీ



కసురుపై సముద్రం

ప్రైవేట్ మద్యం షాపులు షురూ

- జిల్లా వ్యాప్తంగా 100కుపైగా దుకాణాలు ప్రారంభం
- పాత ధరలే కొనసాగింపు

నెల్లూరు(క్రైమ్): నూతన మద్యం పాలసీలో భాగంగా జిల్లాలో ప్రైవేట్ మద్యం దుకాణాల ఏర్పాటు బుధవారం ప్రారంభమైంది. భారీ వర్షాలు, పలు చోట్ల అద్దెకు దుకాణాలు లభించకపోవడంతో పూర్తిస్థాయిలో ఏర్పాటు కాలేదు. మరోవైపు పాత ధరలకే విక్రయాలు సాగించడంపై మందుబాబులు తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. దేవరపాళెంలోని ఐఎమ్మెల్ డిపోలో మద్యం కొనుగోలుకు 145 మంది వ్యాపారులు ఇండెంట్లు వేశారు. ఇప్పటి వరకు 100కుపైగా దుకాణాలకు మద్యం కొనుగోలు పూర్తయింది. రూ.ఆరు కోట్ల మేర వ్యాపారులు కొనుగోలు చేశారని సమాచారం. కొందరు వ్యాపారులు పాత జీఆర్వో భవనాల్లోనే దుకాణాల ఏర్పాటుకు యజమానులను సంప్రదించి అగ్రిమెంట్లు చేసుకొని వాటిలోనే ప్రారంభించారు. కొన్నిచోట్ల అద్దెకు షాపులు లభించకపోవడం, జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలతో దుకాణాల ఏర్పాటుకు అవాంతరాలు ఏర్పడుతున్నాయి. మరికొన్ని చోట్ల అధికార పార్టీ నేతల ఒత్తిడి దీనికి కారణమని తెలుస్తోంది. తమ ప్రాంతాల్లో మద్యం దుకాణాలను ఏర్పాటు చేయాలంటే కచ్చితంగా ఎంతో కొంత వాటా ఇవ్వాల్సిందేనంటూ లైసెన్స్‌దారులపై బెదిరింపు చర్యలకు పాల్పడుతున్నారు. అధికార పార్టీ నేతలను కాదని వ్యాపారాలు సాగించలేమని భావించి వారి డిమాండ్లకు తలొగ్గారని తెలుస్తోంది. పూర్తి స్థాయిలో దుకాణాలు గురువారం నాటికి ఏర్పాటవుతాయని ఎక్సైజ్ అధికారులు పేర్కొంటున్నారు.

మందుబాబుల ఆగ్రహం

తక్కువ ధరకే మద్యం అందుబాటులోకి వస్తుందని మందుబాబులు భావించారు. జోరువానను సైతం లెక్కచేయకుండా దుకాణాల వద్ద ఉదయం నుంచే పడిగాపులు కాశారు. అయితే పాత ధరలకే విక్రయాలు సాగించడంతో అసహనానికి గురయ్యారు. రూ.99కే క్వార్టర్‌ను అందుబాటులోకి తీసుకొస్తామని చంద్రబాబు నమ్మించి మోసగించారని ఆరోపించారు. మరోవైపు మద్యం కొనుగోలు చేసి అక్కడే సేవించారు. నెల్లూరు పరిసర ప్రాంతాల్లోని కొన్ని మద్యం దుకాణాల్లో నిర్ణీత ధర కంటే రూ.10 అదనంగా వసూలు చేశారు.



వేదాయపాళెంలోని ప్రైవేట్ దుకాణంలో ప్రారంభమైన విక్రయాలు

కేజీబీవీలకు నిధుల విడుదల

నెల్లూరు (టౌన్): జిల్లాలోని భవిత కేంద్రాలు, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలకు రాష్ట్ర ప్రభుత్వం నిధులను విడుదల చేసిందని సమగ్రశిక్ష ఏపీసీ ఉషారాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. భవిత కేంద్రాల్లో చదువుతున్న ప్రత్యేకావసరాలు గల పిల్లలకు రవాణా ఖర్చులు, విద్యార్థులను కేంద్రాలకు తీసుకొస్తున్న సహాయకుల ఉపకార వేతనాల కోసం రూ.73 లక్షలు.. కేజీబీవీల్లో కాంట్రాక్ట్ ఉద్యోగుల జీతభత్యాల కోసం రూ.85 లక్షలను విడుదల చేశారని చెప్పారు.

భారీ వర్షాలతో అతలాకుతలం

భారీ వర్షాలు జిల్లాపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. సోమవారం నుంచి కురుస్తున్న వానలకు వివిధ ప్రాంతాల్లో వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. బుధవారం పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కుండపోత వర్షం కారణంగా పంట పొలాలు నీటమునిగాయి. పట్టణాలు, పల్లెల్లోని రహదారులపై నీరు పారుతోంది. చెరువులు నిండుతున్నాయి. సముద్రం అల్లకల్లోలంగా మారింది. నెల్లూరు నగరంలో రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. వాహనదారులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు.

– సాక్షి నెట్‌వర్క్


నెల్లూరులో చెరువును తలపిస్తున్న ఆర్టీసీ కాలనీ


నెల్లూరు టెక్కేమిట్ట ప్రాంతంలో జలమయమైన రోడ్డు


నిండుకుండలా అల్లూరు చెరువు


ఇందుకూరుపేట: మైపాడు తీరంలో భద్రపరిచిన బోట్లు, వలలు


బిట్రగుంట: వర్షాలకు నిండిన కడనూతల చెరువు


పొగతోట ప్రాంతంలో రోడ్డుపై నిల్వ చేరిన మురుగునీరు




కనకమహల్ సెంటర్లో రోడ్డుపై నిలిచిన వర్షపునీరు


నెల్లూరు తల్పగిరి కాలనీలో..


బుజబుజనెల్లూరు హైవే వద్ద వర్షం


గుడ్లూరు మండలం చెమిడిదపాడు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న ఎలికేరు


బద్దిపూడి వద్ద ఉప్పటేరు ఇలా..


కావలి: పొలాల్లో నిలిచిన వర్షపునీరు


పొదలకూరు: నావూరు పెద్దవాగు వద్ద పోలీసులు


కావలి: భారీ అలల కారణంగా ఇసుకలో కూరుకుపోయిన వలలు


సండే మార్కెట్లో బ్యాగ్‌లు కుట్టేవారి అవస్థలు


సీతారామపురం: భైరవకోన క్షేత్రంలో వరదనీరు


సీతారామపురం: భైరవకోనలో చప్టాపై నీరు ప్రవహిస్తుండడంతో ఆగిన రాకపోకలు


జలదంకి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న చిప్పలేరు వాగు


సంగం: కోలగట్ల వద్ద పెన్నానది ఉధృతి


నెల్లూరు స్టోన్‌హౌస్‌పేట ప్రాంతంలో వృద్ధుడి అవస్థలు


సోమశిల: రైతులతో కలిసి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

మభ్యపెట్టి.. అప్పులు చేసి..

- మహిళా భక్తుల నుంచి రూ.50 లక్షల వరకు వసూలు
- చెరువు స్థలంలో ఆశ్రమ నిర్మాణం

కావలి: కావలి మండలం అన్నగారిపాళెం పంచాయతీ పూలదొరువు గ్రామంలో శ్రీనిలయం ఆశ్రమంలో స్వామీజీ పేరిట దాసరి పవన్ కుమార్ చేసిన అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. ఆశ్రమ అభివృద్ధి, పూజల పేరుతోపాటు కుటుంబ అవసరాల కోసం మహిళా భక్తుల నుంచి సుమారు రూ.50 లక్షల వరకూ అప్పులు చేసి వాటిని తీర్చకుండా ఆశ్రమం ఖాళీ చేస్తుండటంతో బాధితులు మంగళవారం నిలదీసిన విషయం తెలిసిందే. కావలి డీఎస్పీ శ్రీధర్‌కు కూడా బాధితులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు విచారణ చేపట్టారు. బాధితుల కథనం మేరకు.. పవన్ కుమార్ ఐదేళ్ల క్రితం చిన్నపాటి ఆశ్రమాన్ని ఏర్పాటు చేశారు. పూజలు చేసి కష్టాలు తొలగిస్తానంటూ స్థానికులు, మహిళలను మభ్యపెట్టాడు. సుమారు 20 మంది నుంచి రూ.50 లక్షలకు పైగా దండుకున్నాడు. ఇటీవల ఓ వివాహిత విషయంలో వివాదం తలెత్తడంతోపాటు ఓ మైనర్ బాలిక విషయంలో గొడవలు జరగడంతో అసలు బండారం బయటపడింది. ఇదే సమయంలో వీఆర్వో సహకారంతో ఇతరులకు చెందిన ఇంటిని తన పేరుపై రిజిస్ట్రేషన్ చేయించుకున్న వివాదం మొదలైంది. దీంతో ఆశ్రమానికి రాకుండా కావలికి మకాం మార్చి అప్పుల వాళ్లకు మొహం చాటేశాడు. ఆశ్రమాన్ని కూడా ఖాళీ చేసేందుకు కొంతమంది అనుచరులను గ్రామానికి పంపించి వస్తువులు తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా అప్పులిచ్చిన బాధితులు తిరగబడ్డారు. ఆశ్రమానికి తాళాలు వేశారు. కావలిలో కూడా అతని బాధితులున్నట్లు తెలిసింది. కాగా ఆశ్రమాన్ని కూడా చెరువు స్థలంలో నిర్మించినా అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదని బాధితులు వాపోతున్నారు.


ఆశ్రమం



జలపాతం కనువిందు

భారీ వర్షాలకు ప్రసిద్ధ శైవక్షేత్రమైన భైరవకోనలో జలపాతం కనువిందు చేస్తూ పర్యాటకులను ఆకర్షిస్తోంది.

– సీతారామపురం

ఆఖరిరోజే 43 టెండర్ల దాఖలు

నెల్లూరు(సెంట్రల్): జిల్లాలోని నాలుగు ఇసుక రీచ్‌లకు సంబంధించి 43 టెండర్లు దాఖలయ్యాయి. బుధవారం చివరిరోజు కావడంతో ఒక్కసారిగా 43 టెండర్లు రావడం విశేషం. ఈనెల 6వ తేదీ నుంచి ఇసుక రీచ్‌లకు టెండర్లను ఆహ్వానించారు. అయితే మంగళవారం కూడా ఒక్కరు కూడా టెండర్ వేయలేదు. ఒక్కరోజులోనే 24 మంది టెండర్లు దాఖలు చేయడం గమనార్హం.

నేడు ప్రకటన

నాలుగు రీచ్‌లకు 24 మంది వివిధ కంపెనీల పేర్లతో టెండర్లు వేశారు. ప్రధానంగా పల్లిపాడుకు 12, మినగల్లు రీచ్‌కు 12, విరువూరు రీచ్‌కు 12, పీకేపాడు రీచ్‌కు 7 వచ్చినట్లు తెలుస్తోంది. గురువారం టెండర్లను ప్రకటించనున్నారు. కాగా అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లోనే మొత్తం ఈ ప్రక్రియ జరగనున్నట్లు తెలుస్తోంది.

అధికార పార్టీ సేవలో..

జిల్లా మైనింగ్ శాఖ అధికారి చంద్రశేఖర్, కార్యాలయంలోని రాయల్టీ ఇన్‌స్పెక్టర్లు అధికార పార్టీ నాయకుల సేవలో తరిస్తున్నట్లు విమర్శలున్నాయి. అధికార పార్టీ ప్రజాప్రతినిధుల వద్దకు మైనింగ్ అధికారులు వెళ్లి ఏ విధంగా వేస్తే టెండర్ దక్కుతుంది?, ఏ ప్రాంతాల్లో ఎంతమేర ఇసుక ఉంది తదితర విషయాలను వివరించినట్లు ప్రచారం జరుగుతోంది. బుధవారం చివరిరోజు అనేకమంది అధికార పార్టీ నాయకులు మైనింగ్ కార్యాలయాలనికి విచ్చేసినట్లు తెలుస్తోంది.

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 140
లేయర్ (లైవ్)	: 120
బ్రాయిలర్ చికెన్	: 250
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 276
లేయర్ చికెన్	: 204

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.60
సన్నవి : రూ.30
పండ్లు : రూ.20



చెల్లని చెక్కు కేసులో నిందితుడికి ఆర్నెల్ల జైలు

నెల్లూరు(లీగల్): అప్పు తీసుకుని తిరిగి చెల్లించే క్రమంలో చెల్లని చెక్కు ఇచ్చాడని నమోదైన కేసులో నేరం రుజువు కావడంతో నెల్లూరు పప్పుల వీధికి చెందిన పాబోలు నాగభూషణం అనే వ్యక్తికి శిక్ష ఖరారైంది. ఆరునెలల జైలుశిక్షతోపాటు ఫిర్యాదికి రూ.9,15,000 పరిహారంగా చెల్లించాలని నెల్లూరు రెండో అదనపు జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ సి.శారదారెడ్డి బుధవారం తీర్పు చెప్పారు. వివరాలు.. నెల్లూరు ఏసీ నగర్‌కు చెందిన వీరపల్లి పుల్లయ్య వద్ద నాగభూషణం 2018 సంవత్సరం మార్చి 9వ తేదీన రూ.9,15,000 అప్పుగా తీసుకుని ప్రామిసరీ నోట్ రాసిచ్చాడు. అప్పు తిరిగి చెల్లించే క్రమంలో 2019 సంవత్సరం సెప్టెంబర్ 4వ తేదీన రూ.9,15,000లకు కోటక్ మహీంద్రా బ్యాంక్, నెల్లూరు బ్రాంచ్ పేరున చెక్కును పుల్లయ్యకు ఇవ్వగా అదేరోజున లక్ష్మీపురం ఎస్‌బీఐ బ్రాంచ్‌లోని తన ఖాతాలో జమ చేశాడు. నాగభూషణం ఖాతాలో నగదు లేని కారణంగా చెక్ బౌన్స్ అయిందని బ్యాంక్ అధికారులు మెమో ఇచ్చారు. దీంతో పుల్లయ్య అదే నెల 16వ తేదీన లాయర్ ద్వారా లీగల్ నోటీస్ పంపాడు. అనంతరం కోర్టులో నిందితుడిపై కేసు దాఖలు చేశారు. కేసు విచారించిన న్యాయమూర్తి పైమేరకు తీర్పు చెప్పారు.

ముమ్మరంగా సహాయక చర్యలు


నెల్లూరులో గుంతను పూడుస్తున్న ట్రాఫిక్ పోలీసులు


ఏఎస్‌పేటలో సమస్యలను తెలుసుకుంటున్న పోలీసులు

నెల్లూరు(క్రైమ్): భారీ వర్షాల నేపథ్యంలో ప్రజల ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా జిల్లా పోలీస్ యంత్రాంగం పటిష్ట చర్యలు తీసుకుంది. బుధవారం అల్లూరు పరిధిలోని సింగపేట, మనుబోలు పరిధిలోని కొలనకుదురుల్లో లోతట్టు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి వారికి ఆహారం తదితరాలను అందజేశారు. వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేయిస్తున్నారు. నెల్లూరు నగరంలోని హరనాథపురం వద్ద ప్రధాన రహదారిపై పెద్దఎత్తున గుంత పడి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం వాట్లింది. ట్రాఫిక్ పోలీసులు తక్షణమే స్పందించి గుంతను కంకర చిప్స్‌తో పూడ్చివేసి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. నెల్లూరు రూరల్ డీఎస్పీ జి.శ్రీనివాసరావు ముత్తుకూరు పరిధిలోని తీరప్రాంతాల్లో పర్యటించారు. విపత్కర పరిస్థితుల్లో 112, పోలీసు కంట్రోల్‌రూమ్ నంబర్లు 93929 03413, 94407 96370కు ఫోన్ చేసి సమాచారం అందిస్తే తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

విద్యుత్ సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలి

- ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): 'భారీ వర్షాల నేపథ్యంలో విద్యుత్ ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా ఎదుర్కొనేందుకు విద్యుత్ శాఖ సిద్ధంగా ఉంది' అని ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ కె.సంతోషరావు అన్నారు. బుధవారం జిల్లాకు వచ్చిన ఆయన నెల్లూరులోని విద్యుత్ భవన్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చర్యల్లో పాల్గొనే సిబ్బంది తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పనుల నిమిత్తం 120 బృందాలతో 674 మంది సిబ్బంది సిద్ధంగా ఉన్నారన్నారు. ఇప్పటికే అన్ని డివిజన్లలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. విద్యుత్ స్తంభాలు, సామగ్రి అందుబాటులో ఉంచుకోవాలని, సిబ్బంది వారి హెడ్‌క్వార్టర్స్‌లోనే ఉండాలని ఆదేశించారు. వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో ఎలాంటి సమస్య వచ్చినా 1912, 1800425155333, వాట్సాప్ నంబర్ 91333 31912కు సమాచారం ఇవ్వాలని కోరారు. జిల్లాలో వర్షాలు తగ్గే వరకు ప్రతి సబ్‌స్టేషన్‌లో ఇద్దరిని మాత్రమే ఉంచి మిగిలిన వారిని అత్యవసరసేవలకు వినియోగించుకోవాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా సర్కిల్ ఎస్‌ఈ విజయన్, ఈఈలు శేషాద్రి బాలచంద్ర, సోమశేఖర్‌రెడ్డి, శ్రీధర్, పరంధామయ్య, సుధాకర్, రాఘవేంద్రం, లక్ష్మీనారాయణ, డీఈఈలు అశోక్, అల్తాఫ్, మునీంద్ర పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీఎండీ


పాల్గొన్న అధికారులు